సాక్షి
జోగుళాంబ గద్వాల
శుక్రవారం : 12 ఏప్రిల్ 2024



..వెంచర్ల పంచాయితీ
కల్వకుర్తి మున్సిపాలిటీలో కొందరు అడ్డగోలుగా అక్రమ వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు.
వివరాలు 8లో ▸



ముమ్మరంగా తనిఖీలు
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 38.1 /26.2

వాతావరణం
ఉదయం ఉంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

90శాతం పశువులకు 'గాలికుంటు' టీకా

- జిల్లాలో ముగిసిన కార్యక్రమం



గద్వాల వ్యవసాయం: పశువులకు వైరస్ ద్వార వ్యాపించే గాలికుంటు వ్యాధి నివారణకు జిల్లా పశుసంవర్ధకశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఆ శాఖ ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ నుంచి పశువులకు ఉచితంగా నివారణ టీకాలు వేశారు. ఈ నెల10న కార్యక్రమం ముగిసింది.

జిల్లా వ్యాప్తంగా 27 బృందాలు..

పశువులు గాలికుంటు బారిన పడకుండా జిల్లా పశుసంవర్ధకశాఖ ఉచితంగా బయోవేట్, రక్ష వీ వ్యాక్ టీకాలు వేసింది. ఈ ఉచిత టీకాలు వేసే కార్యక్రమాన్ని మార్చి 1 నుంచి ప్రారంభించింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 27 బృందాలను నియమించింది. ఒక్కో బృందంలో ఒక ప్యారవేట్, ఒక సబార్డినేట్, ఇద్దరు గోపాలమిత్రలు ఉన్నారు. ప్రతిరోజు ఈబృందాలు ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ పాడి రైతులకు చెందిన పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. బృందాలను ఆయా మండల పశువైద్యాధికారులు పర్యవేక్షించారు. కాగా మొత్తం కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. జిల్లాలో 55,237 ఆవులు, ఎద్దులు, కోడెలు, కోడెదూడలు ఉండగా ఇందులో 51,770 వాటికి వేశారు. అదేవిధంగా 51,063 గేదెలు, దూడలు ఉండగా, ఇందులో 43,668 వాటికి వేశారు. మొత్తం మీద 90శాతం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మిగిలిపోయిన పశువులకు కూడా వ్యాధి నివారణ టీకాలు వేస్తామని ఆయన చెప్పారు. పాడి రైతులు సంబంధిత మండల పశువైద్య సిబ్బందికి సమాచారం అందిస్తే, సిబ్బంది ఆగ్రామానికి వెళ్లి టీకాలు వేస్తారని వివరించారు.

బీజేపీని వీడిన ముఖ్య నాయకులు

నారాయణపేట రూరల్/ మక్తల్: పార్లమెంట్ ఎన్నికల వేళ బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బ తగలనుంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీకి నారాయణపేట, మక్తల్‌లోనే మంచి మెజార్టీ వస్తుందని భావిస్తున్న తరుణంలో నలుగురు కీలక నేతలు రాజీనామా చేశారు. ఈ రెండు అసెంబ్లీ సెగ్మెంట్‌లో కమలం అభ్యర్థులుగా పోటీ చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగపాండురెడ్డి, జలేందర్‌రెడ్డితోపాటు రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి మహబూబ్‌అలీ తమ రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న రఘురామయ్యగౌడ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులుకు గురువారం రాత్రి అందించారు. అయితే రాజీనామాకు సరైన కారణాలు తెలియరాలేదు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. అయితే జలేందర్‌రెడ్డికి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి వర్గీయుడనే పేరు ఉండటంతో ఆయన కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని స్థానికంగా చర్చించుకుంటున్నారు. భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలతో చర్చించి వెల్లడిస్తామన్నారు.

దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి..

చారకొండ: బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. మండలంలోని సిర్సనగండ్లలో గురువారం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం, దేశాభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. మోదీ నాయకత్వంలో 400 సీట్లు సాధించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 50 మంది చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.

ప్రత్యేక కార్యాచరణ

తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ యాక్షన్‌ప్లాన్

- జిల్లాకు రూ.2కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు
- స్థానిక నీటి వనరులతో గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా
- గట్టు, అయిజ, అలంపూర్ మండలాలు స్వయంగా పర్యవేక్షణ
- అవసరమైతే కర్ణాటక నుంచి నీటిని తీసుకునేందుకు సిద్ధం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ బీఎం సంతోష్

సాక్షి ఇంటర్వ్యూ



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: గతేడాది వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవలేదు. ఫలితంగా యాసంగిలో జిల్లాలోని ప్రాజెక్టుల కింద పంటలకు క్రాప్‌హాలిడే ప్రకటించారంటే జూరాల, నెట్టెంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టులలో నెలకొన్న నీటినిల్వల సమస్య తీవ్రతను స్పష్టం చేస్తుంది. 2023 వేసవితో పోల్చితే ఈ ఏడాది వేసవిలో అది కూడా మార్చిలోనే భూగర్భ జలాలు సుమారు ఒక మీటర్ మేర పడిపోయాయి. వేసవిలో ఎలాంటి సమస్య తలెత్తకుండా తాగునీటిని సరఫరా చేయడం ప్రభుత్వానికి పెను సవాల్‌గా మారింది. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లాను యూనిట్‌గా తీసుకుని సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్ బీఎం సంతోష్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్, ప్రత్యేక అధికారులు, జిల్లా అధికార యంత్రాంగంతో 255 గ్రామ పంచాయతీలు, 4మున్సిపాలిటీలలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లాకు రూ.2కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయగా, స్థానికంగా గ్రామపంచాయతీ, సీడీపీ నిధులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ఈమేరకు ఏ చర్యలు తీసుకోబోతున్నారనే విషయాలు కలెక్టర్ బీఎం సంతోష్ 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

డిమాండ్‌కు సరిపడా తాగునీటి సరఫరా

జిల్లాలో మొత్తం 255 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీలు ఉన్నాయి. రోజుకు సుమారు 78ఎంఎల్‌డీ తాగునీరు అవసరం. మన జిల్లాలో ప్రధాన నీటివనరు జూరాల ప్రాజెక్టు కాగా, అదేవిధంగా మిషన్‌భగీరథతో పాటు స్థానికంగా బోరు మోటార్లు, చేతిపంపులు కూడా అదనంగా నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగింది. ప్రస్తుతం మన వద్ద ఉన్న నీటి వనరుల ద్వారా జిల్లాకు ఉన్న డిమాండ్ మేరకు ఇప్పటి వరకు ఎక్కడా ఇబ్బందులు ఏర్పడకుండా ప్రతిరోజు సరిపడా తాగునీటిని సరఫరా చేస్తున్నాం

ప్రత్యేకంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్..

జిల్లాలో తాగునీరు సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా నిరంతరాయంగా డిమాండ్‌కు తగ్గట్టు నీటిని అందించేందుకు ప్రత్యేకంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించడం జరిగింది. ప్రధానంగా మిషన్‌భగీరథ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, ప్రత్యేక అధికారుల బృందం, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలతో యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నాం. ముఖ్యంగా జూరాల ప్రాజెక్టు, మిషన్‌భగీరథ పథకాలను కొనసాగిస్తూనే వాటి ద్వారా సమస్యలు తలెత్తినప్పుడు అదనంగా స్థానికంగా అందుబాటులో ఉన్న నీటివనరుల ద్వారా తాగునీటి సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశాం. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా బోరుమోటార్లు, చేతిపంపులు, వాటర్‌ట్యాంకర్లు, ప్రైవేటు రైతుల బోర్లు, బావులను గుర్తించడం జరిగింది.

జూరాల ప్రాజెక్టులో 3టీఎంసీల నీరు

డిమాండ్‌కు తగ్గట్టుగా జిల్లాకు అవసరమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలాశయంలో ప్రస్తుతం 3టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. నీటి డిమాండ్ దృష్ట్యా ఎక్కడా కూడా నీరు వృథా కాకుండా అవసరమైన చోట్ల తాగునీటి పైపులైన్లు, ఫిల్టర్‌బెడ్ల వద్ద మరమ్మతు ప్రక్రియ చేపట్టడం జరిగింది. జూరాలలోని 3టీఎంసీల ద్వారానే తాగునీటిని సరఫరా చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకొన్నాం.

జిల్లాకు రూ.2కోట్ల ప్రత్యేక నిధులు

తాగునీటి అవసరాల కోసం జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.2కోట్ల నిధులను విడుదల చేసింది. వీటి ద్వారా స్థానికంగా అందుబాటులో ఉన్న చేతిపంపులు, బోరుమోటార్లు, తాగునీటి పైపులు వంటివాటికి అవసరమైన చోట మరమ్మతు చేపడుతున్నాం. వీటితో పాటు స్థానికంగా గ్రామపంచాయతీ నిధులు, అదేవిధంగా సీడీఎఫ్ నిధులు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటిని అవసరమైన పక్షంలో వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాం.

మూడు మండలాలు, 15 గ్రామాలపై ప్రత్యేక పర్యవేక్షణ

జిల్లా వ్యాప్తంగా వేసవిలో సహజంగా గట్టు, అయిజ, అలంపూర్ మండలాలు కొంతమేర తాగునీటి సమస్యలు ఏర్పడతాయి. ఈప్రాంతాలలో అధికారులు నిరంతరం పనిచేస్తున్నప్పటికీ సమస్య దృష్ట్యా నేనే స్వయంగా పర్యవేక్షిస్తున్నాను. ఇక్కడ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నాం. జిల్లా వ్యాప్తంగా 15 గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తినట్లు సంబంధిత అధికారులు నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ గ్రామాలను స్వయంగా క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాను. అక్కడ తలెత్తిన సమస్యకు అవసరమైన పరిష్కార చర్యలు చేపట్టడం జరిగింది. ప్రస్తుతం ఇబ్బందులు తొలగిపోయాయి.

అధికార యంత్రాంగం అప్రమత్తం

జిల్లా ప్రజలకు తాగునీటి అందించేందుకు రూపొందించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం నిరంతరాయంగా పనిచేస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి శృతిఓఝూ కూడా ఇటీవల జిల్లా అధికారులందరితో సమీక్షించి తాగునీటి సరఫరాపై అవసరమైన చర్యలపై ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మిషన్ భగీరథ, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలు ప్రథమ ప్రాధాన్యతతో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

అవసరం మేరకు నారాయణపూర్ నుంచి నీరు..

తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకుంటున్న చర్యలు కాదని నీటిసమస్య తీవ్రత తలెత్తితే 2019లో మాదిరి అవసరమైన పక్షంలో కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా నీటిని తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యమ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసింది. ఇందుకుగాను రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ, ప్రిన్సిపల్ కార్యదర్శితో కూడిన ఉన్నతాధికారులు ఇప్పటికే ముందస్తు చర్యలు తీసుకున్నారు. కర్నాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 23టీఎంసీల అందుబాటులో ఉంది. అక్కడి నుంచి నీటిని తీసుకునేలా సిద్ధంగా ఉన్నాం.

ఆదర్శప్రాయుడు జ్యోతిరావు పూలే..



జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్.. ఇతర అధికారులు



జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల రూరల్/గద్వాల: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విద్యా, ఉపాధి కోసం పాటుపడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని జెడ్పీచైర్ పర్సన్ సరిత కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కృష్ణవేణి చౌరస్తాలో ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్త్రీ విద్య ద్వారానే సామాజిక అసమానతలను తొలగించవచ్చని గ్రహించి మహిళా అభ్యున్నతికి పూలే ఎనలేని కృషి చేశారన్నారు. పూలే చీకటి బతుకుల్లో వెలుగు నింపడం కోసం దీపంగా వెలిగారని, అణగారిన కులాల్లో ఐక్యత తీసుకవచ్చి అచరణాత్మకమైన కార్యకలాపాల ద్వారా పూలే ఆశయాల, లక్ష్యాల సాధనకు కృషి చేద్దామని కోరారు. విద్య ద్వారానే చైతన్యం వస్తుందని భావించి తన భార్య సావిత్రి బాయిని ఉపాధ్యాయురాలిగా మార్చి స్త్రీల కోసం ప్రత్యేకంగా స్కూలు ప్రారంభించారని పేర్కొన్నారు. ఆయన రాసిన పుస్తకాలను అనేక మంది స్ఫూర్తిగా తీసుకొని సమాజ మార్పుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మాజీ జడ్పీచైర్మన్ బండారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి స్త్రీ విద్య కోసం పాటుపడిన గొప్ప ఆదర్శప్రాయులు జ్యోతిరావుపూలే అని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం జ్యోతిరావుపూలే 198వ జయంతిని ఐడీవోసీ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కలెక్టర్ జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్యోతిరావుపూలే తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి మహిళలకు విద్యను అందించేందుకు అహర్నిషలు కృషి చేశారన్నారు. వీరికోసం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యనందించారు. అదేవిధంగా గొప్పసంఘసంస్కర్త అయిన పూలే సమాజంలో కులాలు, మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసి గొప్ప వ్యక్తన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్, ఏవో వీరభద్రప్ప, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి శ్వేతాప్రియదర్శిని, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, డీవైఎస్‌వో బీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కమలం వర్సెస్ హస్తం

నువ్వా.. నేనా!



హోరాహోరీగా పార్లమెంట్ పోరు

- మహబూబ్‌నగర్‌లో కౌంటర్ రాజకీయాలు
- డీకే అరుణ, చల్లా వంశీచంద్ మధ్య మాటల యుద్ధం
- స్వయంగా రంగంలోకి దిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- బీజేపీ టార్గెట్‌గా విమర్శలు, సెంటిమెంట్ అస్త్రాలు
- నాగర్‌కర్నూల్‌లో అభ్యర్థుల పోటాపోటీ యత్నాలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ మాత్రమే వచ్చింది. నోటిఫికేషన్ జారీకి ఇంకా వారం రోజులు.. పోలింగ్‌కు సుమారు నెల రోజుల సమయం ఉంది. కానీ, మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో పోరు తారస్థాయికి చేరింది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య నువ్వా.. నేనా అన్నట్లు హోరాహోరీ రణం నడుస్తోంది. ఇరుపార్టీల అభ్యర్థులు డీకే అరుణ, చల్లా వంశీచంద్‌రెడ్డి మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు.. సవాళ్లు, ప్రతి సవాళ్లు.. కౌంటర్లు, ప్రతి కౌంటర్లతో పాలమూరు అట్టుడుకుతోంది. గెలుపే లక్ష్యంగా ఇరు పార్టీల అభ్యర్థులు రూపొందించుకున్న వ్యూహాలకు అనుగుణంగా దూకుడు పెంచడంతో పొలిటికల్ హీట్ అమాంతంగా పెరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందినవారు కావడం.. అందులోనూ స్వయంగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి ఈ లోక్‌సభపైనే ఉండగా.. రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

ముప్పేట దాడి..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు కాగా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ ప్రతిపక్షాలైన బీజేపీ, బీఆర్ఎస్ ముప్పేట దాడి చేస్తున్నాయి. అంతేకాకుండా సీఎం రేవంత్ ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంపై గురిపెట్టాయి. ఇక్కడ గెలుపోటములు ప్రభుత్వ పాలనకు రెఫరెండంగా భావించే అవకాశం ఉన్న నేపథ్యంలో సీఎం రేవంత్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఆయన స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆయన కొడంగల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ టార్గెట్‌గా విమర్శించడం హాట్‌టాపిక్‌గా మారింది.

విమర్శలు, సెంటిమెంట్ అస్త్రంగా..

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలి పదవిలో ఉన్న డీకే అరుణ.. ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీ మేరకు పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఎందుకు జాతీయ హోదా తేలేకపోయారు..? అచ్చంపేట- తాండూరు, కృష్ణా- వికారాబాద్ రైల్వేలేన్ పెండింగ్, నారాయణపేటకు మంజూరైన సైనిక్ స్కూల్‌ను వేరే ప్రాంతానికి తరలించడంపై బీజేపీ నాయకులు ఏం చేశారు అంటూ పలు అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కొడంగల్ వేదికగా విమర్శలు గుప్పించారు. దీంతోపాటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రాంతంలోని బీడు భూములను నీళ్లతో తడిపేందుకు రూ.4 వేల కోట్లతో కొడంగల్- నారాయణపేట పథకాన్ని మంజూరు చేశామని.. ఇదంతా మీ ప్రాంతానికి చెందిన బిడ్డ సీఎంగా ఉన్నందుకేనంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాదిరి సెంటిమెంట్ రగిల్చేలా రేవంత్ ప్రసంగించారు.

చల్లా వంశీచంద్‌రెడ్డి: అవకాశవాద రాజకీయాలకు మారు పేరు డీకే అరుణ.. 2019 ఎన్నికల సమయంలో ప్రదేశ్ కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో రూ.15 కోట్లు ఇస్తే కాంగ్రెస్ నుంచి మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేస్తానని ఆమె చెప్పింది. ఉత్తమ్ వంటి పలువురు పెద్దలు ఈ సమావేశంలో ఉన్నారు. డీకే అరుణ డబ్బులు అడిగినట్లు ప్రమాణం చేయడానికి నేను సిద్ధం. ఏ రామ మందిరానికి రమ్మన్నా వస్తాను.



డీకే అరుణ : సూట్‌కేసులు తీసుకుని మందికి టికెట్ అమ్ముకున్న చరిత్ర ఎవరికి ఉందో కల్వకుర్తి, మహబూబ్‌నగర్ ప్రజలకు బాగా తెలుసు. వాళ్ల స్థాయిని పెంచుకోవడానికి నాపై ఆరోపణలు చేయడం జరిగింది. రానున్న ఎన్నికల్లో కూడా మహబూబ్‌నగర్ టికెట్ రూ.50 కోట్లకు అమ్ముకొని వెళ్లిపోతాడు. ఆరోపణలు చేసిన వ్యక్తితోపాటు ఆ పెద్ద నాయకులు అందరూ ఏ గుడికి వస్తారో.. చెబితే నేను కూడా వస్తా.

డీకే అరుణ : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది డీకే అరుణ. 2014 ఎన్నికల సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలో గెలుపు కోసం ఎవరు కృషి చేశారో తెలుసుకో. పాలమూరులో పోటీలో ఉన్న ఆ వ్యక్తి కేవలం ఓట్ల కోసం వచ్చిన వారే. వారెవరికీ పాలమూరుతో పేగుబంధం లేదు. డీకే అరుణపై మాట్లాడితే రాజకీయ మైలేజ్ వస్తుంది అనుకోవడం పొరపాటు. నాపై విమర్శలు చేసే స్థాయి వంశీచంద్‌రెడ్డికి లేదు

చల్లా వంశీచంద్‌రెడ్డి : డీకే అరుణ నన్ను ఎమ్మెల్యే చేసిందన్న వాఖ్యల్ని ఖండిస్తున్నా. 2009–14లో ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యుడిగా నేను సిఫార్సు చేస్తేనే మీకు టికెట్ వచ్చింది. డీకే అరుణ కాంగ్రెస్‌లో రాకముందే నేను పార్టీలో అప్పటికే సీనియర్‌ను. నేను 2006లో ఏఐసీసీ సభ్యుడిగా ఉంటే మీరు 2014లో అయ్యారు. నన్ను నాన్ లోకల్ అంటున్నారు కదా.. మీరు ఏ స్థానికత ప్రాతిపదికన పాన్‌గల్ నుంచి జెడ్పీటీసీగా పోటీ చేశారు?

..మహబూబ్‌నగర్ పార్లమెంట్ బరిలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య మాటల యుద్ధానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

డీకే అరుణ దీటైన స్పందనతో..

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై డీకే అరుణ దీటుగా స్పందించారు. 'పాలమూరు' పాత డిజైన్‌కు కాంగ్రెస్ అనుమతులు ఇప్పిస్తే జాతీయ హోదాపై మోదీతో మాట్లాడుతామంటూ ఆయన ప్రస్తావించిన అన్ని అంశాలపై స్పష్టత ఇచ్చారు. అంతేకాదు.. తనను పదవి నుంచి తప్పించేందుకు కొంతమంది తెరవెనుక గూడుపుఠాణి చేస్తున్నారని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆమె దీటుగా స్పందించారు. 'ముఖ్యమంత్రి అని మీరు మరిచిపోయి మాట్లాడుతున్నారు.. భాష మాట్లాడే ముందు ఆలోచించుకోవాలి.. మీకు ఎందుకు సింపతి.. మేం గెలవాలనుకుంటే నీ మీద కుట్ర పన్నినట్లా?' అని ఘాటుగా స్పందించడం పొలిటికల్ హీట్‌ను పెంచేలా చేసింది. ఇప్పుడే ఈ స్థాయిలో ఉంటే పోలింగ్ సమయం దగ్గరపడే వరకు ఇంకెలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోననే ఆసక్తి నెలకొంది. కాగా, మహబూబ్‌నగర్‌తోపాటు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీ ప్రచారం నిర్వహిస్తుండగా.. బీఆర్ఎస్ రైతు దీక్షతో ముందుకుసాగుతోంది.

ఈద్ ముబారక్

- భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్
- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రజా ప్రతినిధులు

గద్వాల: పవిత్ర రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండగను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి ప్రార్థనలతో ముగించారు. గురువారం ఉదయం ఆయా ప్రాంతాల్లోని ఈద్గాల వద్దకు పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు చేసేందుకు తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌలానా అబ్దుల్ హకీం నమాజ్ చేయించారు. ప్రార్థనల అనంతరం ఈద్గా దగ్గర శ్మశాన వాటికలోని తమ పెద్దల సమాదుల వద్ద పుష్పగుచ్చాలు ఉంచారు. చుట్టు పక్కల గ్రామాల ముస్లింలు సైతం గద్వాల ఈద్గాకు వచ్చి ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సీఐ భీంకుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

రంజాన్ పండగను పురస్కరించుకొని ముస్లింకు పండగ శుభాకాంక్షలు తెలపడానికి వివిధ పార్టీల నాయకులు ఈద్గా దగ్గరకు వచ్చారు. ప్రార్థనల అనంతరం ముస్లింలకు జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బీఎస్ కేశవ్, బీఎస్పీ జిల్లా నాయకుడు అతికుర్ రహిమాన్, ఎంఐఎం జిల్లా కన్వీనర్ మున్నా బాషతో పాటు పలువురు నాయకులు ఈద్ ముబారక్ తెలిపారు. ఇదిలాఉండగా, మైనార్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పేర్కొన్నారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ ముస్లింల ఐక్యతకు గద్వాల నిదర్శనమని పేర్కొన్నారు. రంజాన్ పర్వదినం ఐక్యతకు ప్రతీక అని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



గద్వాలలో ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు



ప్రార్థనల అనంతరం ఈద్గా నుంచి తరలివెళ్తూ..

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం


రాజాలు (ఫైల్)

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి–యాపట్ల మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. అంబట్‌పల్లికి చెందిన రాజాలు (50) బైక్‌పై యాపట్ల నుంచి అంబట్‌పల్లికి వస్తుండగా యాపట్ల వంతెన మలుపు వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాజాలుకు భార్య వనజ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు వివరించారు.

గాయపడిన సివేట్ క్యాట్ మృతి



బిజినేపల్లి: మండలంలోని గంగారం గ్రామం, భీమునితండా పరిధిలో బుధవారం కుక్కల దాడిలో గాయపడిన ఆసియన్ పాం సివేట్ క్యాట్ అనే అరుదైన జీవి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఫర్వేజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం సాయంత్రం తండా పరిధిలో నిస్సహాయ స్థితిలో ఉన్న సివేట్ క్యాట్‌ను గుర్తించిన తండావాసులు వెంటనే సమాచారం ఇవ్వగా తీసుకొచ్చి పశు వైద్యాధికారితో చికిత్స అందించామని.. గురువారం మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని వనపట్లకు చెందిన మొల్గర రాములు (44) ఈ నెల 5న ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్‌ఐ గోవర్దన్ తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

వివాహిత బలవన్మరణం


పావని(ఫైల్)

ఖిల్లాఘనపురం: ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం తిర్మలాయపల్లి శివారులో గురువారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం భూత్పూర్ మండలం మద్దిగట్లకు చెందిన పావని (21), అదే గ్రామానికి చెందిన ఏముల శ్రీకాంత్ రెండేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. పావనికి తరుచూ కడుపునొప్పి వస్తుండటంతో భరించలేక బుధవారం సాయంత్రం తిర్మలాయపల్లి శివారు వ్యవసాయ పొలంలో చెట్టుకు చున్నీతో ఉరేసుకుంది. మద్దిగట్లకు చెందిన కొందరు రైతులు గురువారం పొలం సర్వేకు ఆ ప్రాంతానికి రాగా చెట్టుకు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పావని తల్లి ఎర్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అక్రమ వెంచర్ల పంచాయితీ

అధికారులే ప్రోత్సహిస్తున్నారని అధికార పార్టీ కౌన్సిలర్ల ఆరోపణ

- మున్సిపాలిటీలో పరిపాటిగా మారిన వెంచర్లలో రాళ్ల తొలగింపు వ్యవహారం
- అన్నీతానై వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్‌లోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి
- అక్రమ వెంచర్ల వ్యవహారంలో మున్సిపల్ కౌన్సిలర్ భర్త


అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లలో రాళ్లను తొలగిస్తున్న కమిషనర్, టీపీఓ, మున్సిపల్ సిబ్బంది

కల్వకుర్తి టౌన్: రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో కల్వకుర్తి మున్సిపాలిటీ ఉండటంతో ఇక్కడ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. అందుకు తోడు రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత గ్రామం కల్వకుర్తికి దగ్గరగా ఉండటంతో ఇక్కడ రియల్ వ్యాపారం జోరుగా సాగుతుంది. రియల్ వ్యాపారాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమార్కులు మున్సిపాలిటీలో అడ్డగోలుగా అక్రమ వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. అక్రమ వెంచర్లను ఏర్పాటు చేయటమే గాక, అందులో మున్సిపాలిటీకి ఇచ్చే 10శాతం భూమిని సైతం ప్లాట్లు చేసి అమ్ముతున్నారు. వీటికి తోడు పాత గ్రామపంచాయితీ లేఅవుట్ పక్కనే ఉండే మరికొంత భూమిని సైతం జీపీ ప్లాట్లుగా చూయించి వాటిని క్రయవిక్రయాలు చేస్తున్నారు. ఇదంతా కొనసాగుతున్నా.. మున్సిపల్ అధికారుల దృష్టికి వచ్చినా.. వారికి ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని అధికార పార్టీ కౌన్సిలర్లు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.

అధికారుల ప్రోత్సాహంతోనే..

మున్సిపాలిటీలో గతంలోనే అక్రమ వెంచర్లను ఏర్పాటు చేశారని, అప్పటి అధికారులు విచారణ చేసి తేల్చిచెప్పారు. అందుకు సంబంధించి వాటిపై నిర్ణయం తీసుకునే లోపే గతంలో మున్సిపాలిటిలోని ప్రధాన అధికారులు బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన అధికారులు వీటిపై చర్యలు తీసుకునేందుకు బదులు, అక్రమార్కులతో ముడుపుల వ్యవహారం జరిపి వాటిపై చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రజలకు తెలిసేలా అధికారులు తూతూమంత్రంగా రాళ్లను తొలగిస్తున్నారు. రాళ్లను తొలగించిన మరుసటి రోజే తిరిగి వాటిని అదే స్థానంలో అక్రమార్కులు పాతుతున్నారు.

పరిపాటిగా మారిన వ్యవహారం...

మున్సిపాలిటీ పరిధిలోని 746, 736, 54 సర్వే నంబర్లకు అనుబంధంగా ఉండే సబ్ సర్వే నంబర్లలో అక్రమార్కులు వెంచర్లను ఏర్పాటు చేశారు. ముందుగా 746 వాటి అనుబంధ సర్వే నంబర్లలో 2 ఎకరాల్లో గతంలో వెంచర్‌ను మున్సిపల్ కౌన్సిలర్ భర్త ఏర్పాటు చేశారు. వీటికి అనుబంధంగా మరో నాలుగు ఎకరాలను అక్రమంగా ఏర్పాటు చేసి, గతంలో ఉన్న వెంచర్ అనుమతులకు మరో డ్రాయింగ్ వేసి పూర్తిగా అనుమతులు ఉన్నట్టుగా వెంచర్‌ను ఏర్పాటు చేసి క్రయవిక్రయాలు చేశారు. ఇతను ఏర్పాటుచేసిన వెంచర్ పక్కన నుంచే తిరుపతి హైవే వెళ్తుండటంతో వెంచర్‌లో ప్లాట్ల క్రయవిక్రయాలు బాగానే జరిగాయి. ఇదే కాకుండా మున్సిపాలిటీ కార్యాలయానికి దగ్గరగా ఉండే 55 వాటి అనుబంధ సర్వేనంబర్‌లో 1,400 గజాలు కేటాయించారు. వాటిని సైతం ఇదే వ్యక్తి సదరు స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయించాడు. ఇదంతా అధికారులకు తెలిసినా ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ భర్త ఏర్పాటు చేసిన వెంచర్లలో అధికారులు రాళ్లను తొలగించారు. ఇలా రెండు సార్లు ఆయా వెంచర్లలో రాళ్లను తొలగించినా.. అక్రమార్కులు మాత్రం రాళ్లను అదే స్థానంలో తిరిగి పాతారు. ఏకంగా గతంలో జీపీ లేఅవుట్లకు రిజిస్ట్రేషన్లు చేయకపోవటంతో, ఏకంగా హైకోర్టుకు వెళ్లి సదరు భూమిపై స్టే తీసుకొని రిజిస్ట్రేషన్లు చేయించారు. ఇదిలా ఉండగా.. ఎన్ని రోజులకైనా ఇబ్బంది అవుతుందని, వారి దగ్గరి బంధువులు, ఇతరులపై ఏకమొత్తంలో 15 వరకు ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించారని సమాచారం.

అన్నీతానై వ్యవహరిస్తున్న ఓ ఉద్యోగి...

మున్సిపాలిటీలో గతంలో టౌన్‌ప్లానింగ్‌లో ఓ ఉద్యోగి అన్ని తానై వ్యవహరిస్తున్నాడని గతంలో పలు ఆరోపణలు ఉన్నా.. అతనిపై కల్వకుర్తి మున్సిపల్ అధికారులు గాని, ఉన్నతాధికారులు గాని ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉండగా.. మున్సిపాలిటీలో ఉన్న అక్రమ వెంచర్లపై సైతం అతని పూర్తిస్థాయి విచారణ అనంతరం ముడుపుల వ్యవహారంతో అంతా సద్దుమణిగి పోయిందని ప్రజలు, కౌన్సిలర్లు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారి ప్రమేయం లేకుండానే అతనే స్వయంగా స్థల పరిశీలన చేసి, రాళ్లను తొలగించే క్రమంలో కమిషనర్‌ను తీసుకెళ్లాడని అధికార పార్టీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. తిరిగి సదరు ఉద్యోగితో మాట్లాడాకే అతని సమ్మతితో వెంచర్లలో రాళ్లను పాతారని కార్యాలయ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. ఓ ప్రధాన అధికారి తన ఉద్యోగ బాధ్యతలను ఎక్కడ నిర్వర్తిస్తే అక్కడే సదరు వ్యక్తిని ఔట్‌సోర్సింగ్‌లో నియమించుకుంటాడని కౌన్సిలర్లతో పాటుగా కార్యాలయంలోని వారి సహోద్యోగులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా ఎవ్వరూ ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు ఉన్నాయి.


తొలగించిన స్థానంలో తిరిగి ప్లాట్ల రాళ్లను పాతుతున్న కూలీలు

ప్రజలకు ప్రమాదమే



అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లలో అమాయక ప్రజలు ప్లాట్లను కొనుగోలు చేయటం ఎప్పటికైనా ప్రమాదమే. అక్రమార్కులకు అధికారుల సహకారం ఉండటంతోనే ఇలాంటి అక్రమ వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్‌లో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే ఓ ఉద్యోగి చెప్పిన విధంగానే అక్రమ వెంచర్లలో ముడుపుల వ్యవహారం జరిగింది. కమిషనర్ పలుమార్లు వీటిపై ఫిర్యాదులు చేసినా.. ఏమి పట్టించుకోవటం లేదు. కమిషనర్ ఉన్నా.. సదరు ఉద్యోగిని కలిస్తేనే కార్యాలయంలో పూర్తి పనులు అవుతుండటం సిగ్గుచేటు.

– శ్రీను, కౌన్సిలర్, కల్వకుర్తి మున్సిపాలిటీ

రాళ్లను తొలగించాం..



మున్సిపాలిటీలోని పలు సర్వే నంబర్లలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లపై పూర్తి విచారణ చేసిన అనంతరం, వాటిలో ఏర్పాటు చేసిన ప్లాట్ల రాళ్లను తొలగించాం. తిరిగి వాటిని ఏర్పాటు చేశారని దృష్టికి రాగానే మళ్లీ వాటిని తొలగించాం. అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్లాట్లను కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దు. మరెవరైనా అనుమతులు లేకుండా మున్సిపాలిటీలో వెంచర్లను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– అజిత్ కుమార్, కమిషనర్, కల్వకుర్తి మున్సిపాలిటీ



లాభాల ఆశజూపి రూ.36.20 లక్షలు టోకరా

- ఆన్‌లైన్ మోసంతో పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

జడ్చర్ల: వాట్సాప్ గ్రూప్ ద్వార పరిచయమైన ఓ గుర్తు తెలియని వ్యక్తి సూచనలు పాటిస్తూ ముందుకు సాగి రూ.36.20 లక్షలు పెట్టుబడిగా పెట్టి మోసపోయిన సంఘటన జడ్చర్లలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. బాదేపల్లి బాబీ స్ట్రీట్‌కు చెందిన వ్యాపారీ ఝూవర్ సునీల్ ఫోన్ నంబర్‌ను గత నెల 27న గుర్తు తెలియని ఓ వ్యక్తి గ్రోవెన్షన్ మీడియా ఎఫ్‌ఎక్స్972 గ్రూప్‌లో యాడ్ చేశాడు. ఈ గ్రూప్‌లో పోస్ట్ చేసిన ప్రొడక్ట్స్ మరియు ప్లేసెస్‌కు సంబంధించి గూగుల్ రివ్యూస్ ఇవ్వవలసి ఉంది. ఇలా రివ్యూస్ ఇచ్చిన వారికి రూ.150 చొప్పున వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పగా రివ్యూస్ ఇచ్చాడు. దీంతో తన బ్యాంకు ఖాతాలో రూ.150 చొప్పున జమ అయ్యాయి. తదుపరి ఓ టెలిగ్రామ్ లింక్ పంపి టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశాడు. ఆ గ్రూప్‌లో రూపొందించిన వివిధ రకాల టాస్క్‌లు పొందుపరిచి వాటిపై పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మబలికారు. వాటిని నమ్మి మొదటగా రూ.2వేలు పెట్టి టాస్క్ పూర్తి చేయగా రూ.3,800 వచ్చాయి. వచ్చిన డబ్బును అందులోనే ఒక ఖాతాను తెరిచి తనకు డబ్బు వచ్చినట్లుగా చూపించారు. తదుపరి వచ్చిన డబ్బును మళ్లీ అందులోనే పెట్టుబడిగా వెచ్చించాడు. ఇలా దశల వారిగా తన బ్యాంకు ఖాతా నుంచి రూ. 5 వేల నుంచి రూ.36,20,180 వరకు వెచ్చించాడు. తదుపరి తనకు రావాలసిన డబ్బును తన బ్యాంకు ఖాతాలో జమచేయాలని కోరగా మరో రూ.10 లక్షలు వెచ్చించాలని చెప్పడంతో అనుమానం వచ్చి తాను మోసపోయానంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. ఉపాధి కూలీలకు గాయాలు


గాయపడ్డ కూలీని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

ఉప్పునుంతల/అచ్చంపేట రూరల్: ఉప్పునుంతల మండలంలోని కంసానిపల్లి సమీపంలో గురువారం మధ్యాహ్నం ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడి 18 మంది ఉపాధి కూలీలకు గాయాలయ్యాయి. ఎస్‌ఐ లెనిన్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతులు గడ్డం పద్మమ్మ, కాంపల్లి రామచంద్రయ్య పొలంలో రాళ్ల ఏరివేత పనులకు గురువారం ఉదయం ఉపాధి కూలీలు ట్రాక్టర్‌లో వెళ్లారు. మధ్యాహ్నం వేళ ఏరిన రాళ్లను ట్రాలీలో నింపుకొని వాటిపై కూర్చొని ఉపాధి కూలీలు తిరిగి గ్రామానికి వస్తుండగా గ్రామ సమీపంలో ఉన్న చీకటివాగు వద్ద ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కలమండల కృష్ణవేణికి కాలి మెడిమ భాగంలో తీవ్ర గాయం కాగా.. మాచర్ల చంద్రయ్యకు చెయ్యి విరిగింది. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన కూలీలను వెంటనే అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ కొట్టె అంజనేయులు అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని బాధితురాలు కలమండల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వైద్యం చేసిన ఎమ్మెల్యే..

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆస్పత్రికి వచ్చి క్షతగాత్రులకు స్వయంగా వైద్యమందించారు. మెరుగైన చికిత్స అందించాలని అక్కడే ఉన్న వైద్యులను ఆదేశించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు క్షతగాత్రులను పరామర్శించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

చిన్నచింతకుంట: షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలోని చిన్నచింతకుంట మండలం ఉంద్యాలలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా.. ఉంద్యాల ఎస్సీ కాలనీలో పాత చర్చి సమీపంలో గ్రామానికి చెందిన బండారి నాగరాజు గుడిసె ఏర్పాటుచేసుకొని నివాసం ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం పాత మట్టి ఇల్లు శిథిలావస్థకు చేరడంతో దానిని కూలగొట్టి అదే స్థలంలో తడకలు, రేకులతో గుడిసె ఏర్పాటు చేసుకున్నాడు. అయితే, గురువారం మధ్యాహ్నం సమయంలో నాగరాజు భార్య లక్ష్మి, కూతురు చిన్నారి, కుమారుడు ప్రబాస్ గుడిసెలో ఉండగా.. ఒక్కసారిగా షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. మొదట మంటలను చూసిన పిల్లలు భయంతో నిద్రిస్తున్న తల్లిని లేపి బయటకు పరుగులు తీశారు. మంటలు ఎగిసి పడడంతో పాటు సిలిండర్ సైతం పేలడంతో గుడిసే పూర్తిగా దగ్ధమైంది. బియ్యం, కొంత నగదు, పట్టాదారు పాసుబుక్కులు, దుస్తులు, తదితర వస్తువులు కాలిపోయాయి. రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని నాగరాజు కుటుంబ సభ్యులు తెలిపారు.


గుడిసెలో కాలిపోయిన సామగ్రి

నాడు తండ్రి.. నేడు తల్లి మృతి

- అనాథలైన ముగ్గురు అక్కాచెల్లెళ్లు
- నందిపేటలో విషాదఛాయలు


మణెమ్మ (ఫైల్)


అనాథలుగా మారిన బాలికలు

భూత్పూర్: ఆ కుటుంబాన్ని విధి వెంటాడుతోంది. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఆ కుటుంబానికి పెద్ద దిక్కు అయిన తండ్రిని కబళించింది. తాజాగా గురువారం అనారోగ్యంతో తల్లి సైతం మృతిచెందింది. దీంతో ముగ్గురు ఆడపిల్లలు అనాథలయ్యారు. ఈ విషాదకర సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలోని మూసాపేట మండలం నందిపేటలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా.. నందిపేట గ్రామానికి చెందిన వెంకట్రాములు, మణెమ్మ (45) దంపతులకు ఐదుగురు ఆడపిల్లలు సంతానం. శిరీష, నందిని, శ్రీలత, శిల్ప, వెన్నెల ఉన్నారు. అయితే, 2011లో తండ్రి వెంకట్రాములు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. అప్పటికీ చిన్న కూతురైన శిరీష వయస్సు రెండు నెలలే. నాటి నుంచి కుటుంబ భారం తల్లి మణెమ్మపై పడింది. అటు రెండు నెలల కూతురితో మొత్తం ఐదుగురు ఆడపిల్లలను కూలీ పని చేస్తూ మణెమ్మ జీవనం సాగించింది. ఇద్దరు పిల్లల వివాహం చేయగా.. ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. కొన్ని నెలల నుంచి మణెమ్మ అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం ఇటీవల హైదరాబాద్‌లో ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. గురువారం పరిస్థితి విషమించి మణెమ్మ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

గ్రామంలో విషాదఛాయలు

తల్లి మృతితో మాకు దిక్కెవరూ అంటూ ముగ్గురు అక్కాచెల్లెళ్లు గుండెలవిసేలా రోదించారు. చిన్న తనంలో తండ్రి మరణించడం, తల్లి సైతం అనారోగ్యంతో మృతిచెందడం.. ఆడపిల్లలు అనాథలుగా మారడంతో గ్రామంలో పలువురిని కంటతడి పెట్టించాయి. పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రైతులపై రౌడీషీట్ తెరవడం శోచనీయం



మరికల్: ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రైతులపై పోలీసులు రౌడీషీట్ తెరవడం శోచనీయమని పాలమూరు అధ్యాయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్రాములు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు న్యాయం చేయాలని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం లేకుండాపోయిందని తెలిపారు. ఇథనాల్ కంపెనీ రద్దు చేసే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. రైతులపై పోలీసులు పెట్టిన రౌడీషీట్ కేసులను ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కంపెనీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు చక్రవర్తి, చైతన్య, శ్రీదేవి, మహదేవ్, రాంచందర్, మల్లేష్, ఆంజనేయులు, లక్ష్మయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

రామన్‌పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతోంది. గురువారం 1,012 అడుగులకు చేరినట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వకు నీటి సరఫరా నిలిపివేశారని.. తాగునీటి అవసరాలకు రిజర్వాయర్ నుంచి 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని వివరించారు.

మట్టి మాఫియా..!

పట్టా భూమిలో అనుమతి.. ప్రభుత్వ గుట్టలో తవ్వకాలు


జిల్లాకేంద్రంలోని శ్రీనివాసపురం శివారు గుట్ట నుంచి మట్టి తరలింపు

- సెలవు రోజుల్లో యథేచ్ఛగా తరలింపు
- చోద్యం చూస్తున్న మైనింగ్ అధికారులు
- అధికారపార్టీ అండదండలతోనేనన్న ఆరోపణలు

వనపర్తి: కొందరు అధికారులు, అధికారపార్టీ నాయకుల అండదండలతో నిబంధనలను తుంగలోతొక్కి యథేచ్ఛగా ప్రభుత్వ స్థలంలో తవ్వకాలకు తెగబడింది మట్టి మాఫియా. ఓ రైతు పట్టా భూమిలో మట్టి తవ్వకానికి అనుమతులు పొంది.. పక్కనే ఉన్న ప్రభుత్వ గుట్టపై పొక్లెయిన్లతో రాత్రి పగలు తేడా లేకుండా పరిమితికి మించి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం మైనింగ్, రెవెన్యూశాఖ అధికారులకు తెలిసినా.. అధికార పార్టీ నాయకుల వత్తిళ్లకు తలొగ్గి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల పోలీసులు సైతం మట్టి తవ్వకాలు, తరలింపుపై విచారణ చేసినా.. సర్వేనంబర్లు ఏవి ఎక్కడున్నాయో రెవెన్యూ, సర్వేశాఖ అధికారులే తేల్చాలంటూ సాకు చూపుతూ మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను వదిలేశారని, ఇందుకు అధికార పార్టీ నేతల సహకారం ఉందని ప్రచారం లేకపోలేదు.

15 రోజుల తాత్కాలిక లీజుతో..

జిల్లాకేంద్రంలోని శ్రీనివాసపురం శివారులో ఉన్న ఓ రైతు భూమి సర్వేనంబర్ 38 నుంచి మట్టి తరలింపునకు కొందరు ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకు జిల్లా మైనింగ్‌శాఖ అధికారులతో అనుమతి పొందారు. కానీ పట్టాభూమిలో కాకుండా పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 55 నుంచి పగలు, రాత్రి తేడాలేకుండా యంత్రాలతో తవ్వకాలు చేపడుతున్నారు. అనుమతి పొందిన నాటి నుంచి ప్రభుత్వ గుట్టలను ధ్వంసం చేస్తుంటే కాపాడాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించటం మట్టి మాఫియాకు అంతర్గత సహకారం అందిస్తున్నట్లేనన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

అధికారులూ.. స్పందించాలి...

ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు మట్టి అవసరమైతే వారి ఆధీనంలో ఉన్న గుట్టల నుంచి తరలిస్తారు. కానీ మట్టి మాఫియా ప్రైవేటు భూమిలో అనుమతి పొంది ప్రభుత్వ గుట్టలు ఖాళీ చేస్తోంది. ఇలా అయితే భవిష్యత్‌లో అభివృద్ధి పనులకు మట్టి అవసరం ఉన్నప్పుడు మట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

అనుమతి పొందిన సర్వేనంబర్‌ను వదిలి ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేపడుతున్నట్లు ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేపట్టినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటాం. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించం.

– గోవిందరాజులు, ఏడీ, మైనింగ్‌శాఖ

సెలవు రోజుల్లోనే..

ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో వరుస సెలవులు రావటంతో అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరని నిరంతరం అనుమతి పత్రంలో పేర్కొన్న పరిమితికి మించి మట్టిని తరలించేందుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఏర్పాటు చేసి గుట్టలను కొల్లగొడుతోంది ఈ మాఫియా. వీరికి అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు అండగా ఉండటంతో మరింత రెచ్చిపోయి తవ్వకాలు, తరలింపు కొనసాగిస్తుండటంతో నిమిషానికి రెండు నుంచి మూడు ట్రాక్టర్లు పరుగులు పెడుతున్నాయి.



అలంపూర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే విజయుడు



గట్టు ఈద్గా దగ్గర ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మానవపాడులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ధరూరులోని ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్

అలంపూర్: రంజాన్ పండుగ పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నెలరోజుల పాటు కఠిన ఉపావాస దీక్ష చేపట్టిన ముస్లింలు బుధవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలకు విరామం పలికారు. రంజాన్ నెలవంకను చూసిన ముస్లింలు రంజాన్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ఉదయం కొత్త దుస్తులు ధరించి అల్లాను స్మరిస్తూ ఈద్గాలకు సమూహంగా తరలి వెళ్లారు. మజీద్, ఈద్గాల్లో ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక నమాజ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని పాత, కొత్త ఈద్గాలలో రంజాన్ పండుగకు పత్యేక నమాజ్ చేశారు. నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలు రంజాన్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఒకరికి ఒకరు ఆత్మీయ అలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం పండుగలో భాగంగా ఫిత్రా, జకాత్‌లను చెల్లించి పండుగ సంప్రదాయాన్ని కొనసాగించారు. అలంపూర్‌లో ఎమ్మెల్యే విజయుడు రంజాన్ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలను కలిసి వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు నాయకులు, తదితరులు ఉన్నారు.

గట్టు: రంజాన్ పండుగను ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్ష అనంతరం బుధవారం సాయంత్రం నెల వంక కన్పించడంతో గురువారం వివిధ గ్రామాల్లోని ముస్లింలు రంజాన్ ఈద్‌ను ఘనంగా చేసుకున్నారు. ఈద్గాల వద్ద ముస్లింలు



అలంపూర్‌లో రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గట్టు చెరువు దగ్గరున్న ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రంజాన్ పండుగ సందర్భంగా పలువురు నేతలు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, సహకార సంఘం అధ్యక్షుడు వెంకటేష్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బల్గెర హనుమంతు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహబూబ్‌పాష, గట్టు మాజీ సర్పంచు ధనలక్ష్మీకృష్ణమూర్తి, గట్టు–1 ఎంపీటీసీ మహేశ్వరి, గట్టు–2 ఎంపీటీసీ కృష్ణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇమాంసాబ్, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ వాహబ్, మాజీ సర్పంచు మోహన్‌గౌడు, మాచర్ల మాజీ సర్పంచు సిద్ధిరామప్పలు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో రంజాన్ పండగను పురస్కరించుకొని ముస్లింలు సంబరాలు నిర్వహించారు. నెల రోజుల పాటు చేసిన ఉపవాస దీక్షను రంజాన్‌తో విరమించుకున్నారు. అనంతరం పిల్లలు, పెద్దలు మజీద్, ఈద్గాల దగ్గరకు చేరుకొని సమూహంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మానవపాడు: ముస్లింలు మండలంలోని ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ఘనంగా నిర్వహించారు. ముస్లిం చిన్న, పెద్దతేడా లేకుండా నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీఓ ఫారుఖ్ హుస్సేన్, డాక్టర్ అబ్దుల్ అజీమ్, మహ్మద్, పహిల్వాన్, మసీదు ముతవల్లి మహబూబ్‌బాషా, కలీం, చోటా, చాంద్, హర్షద్, ఇబ్రహీం, రహమత్ షాలీబాషా, చోట్, అన్వర్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థన చేశారు. మండల కేంద్రంతో పాటు నెట్టెంపాడు, చింతరేవుల, ఉప్పేరు, ర్యాలంపాడు, మార్లబీడు తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేశారు.ఈ సందర్భంగా చిన్నారులు ఈద్గా వద్ద సందడి చేశారు. ఈద్గా వద్ద ఎస్‌ఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

కేటీదొడ్డి: రంజాన్ పండుగ పర్వదినం సందర్భంగా ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేశారు. కొత్త దుస్తులు ధరించి ఈద్గాలకు సమూహికంగా వెళ్లి ప్రార్థన చేశారు. పేదవారికి వివిధ రకాల కానుకలు అందజేసి ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మౌలాలి, మైబు, నసీరుద్దీన్, తదితరులు ఉన్నారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా మతాలకతీతంగా కలిసి భోజనం చేశారు.

అయిజ: మండల కేంద్రం, వివిధ గ్రామాల్లో రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థన చేసి, మత పెద్దలు ఖురాన్ చదివి అల్లా జీవిత చరిత్రను వివరించారు. హిందువులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



మానవపాడులో ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు



ఉండవెల్లిలో చిన్నారుల అలింగనం



రాజోళిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పండుగ ముస్లింలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లింలు, ఎస్‌ఐ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.



నందిన్నె ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు



రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ముస్లింలు



అయిజలో ఈద్గావద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు



ఉండవెల్లిలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

క్లుప్తంగా

ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ



ఉండవెల్లి: మండలంలోని క్యాతూరు పీహెచ్‌సీ పరిధిలో తక్కశిల, ప్రాగటూరు, శేరుపల్లె, మారమునగాల–1,2 గ్రామాల రైతులకు, ఉపాధి కూలీలకు, భవన నిర్మాణ కూలీలకు, ఇతర పనులకు వెళ్లే ప్రతి ఒక్కరికీ ఎండల తీవ్రత కారణంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. ఎండలు పెరగడం వల్ల ఉదయం 6గంటల నుంచి 10 గంటల లోపు వ్యవసాయ పనులు, ఉపాధి పనులు, భవన నిర్మాణ పనులు చేయాలని సూచించారు. ఎండలో ఎక్కడికి వెళ్లినా నీటిని వెంట పెట్టుకుని, తలకు గుడ్డను కట్టుకుని వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మానవపాడు: లోకసభ ఎన్నికల నేపథ్యంలో రూ. 50వేలకు మించి నగదు తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. గురువారం మండలంలో చంద్రశేఖర్, శ్రీనగర్, కొర్విపాడులో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ నింబంధనలు పాటించాలన్నారు. మద్యం తరలించినా, బెల్ట్ షాపుల్లో అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

పాతబోరుకు మరమ్మతు చేయండి



మానవపాడు: వేసవికాలం నీటి సమస్యలు లేకుండా గ్రామాల్లో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తోంది. గ్రామాల్లో మండల అధికారులు పాతబోర్లను పరిశీలిస్తున్నారు. మండలంలోని జల్లాపురంలో పాతబోర్లను పరిశీలించి మరమ్మతులు చేసి ప్రజలకు నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేటీదొడ్డి: మండలంలోని గంగన్‌పల్లి నుంచి వెళ్తున్న 33 కేవీ, మల్లాపురం ఫీడర్, 33/11 కేవీ నందిన్నె, సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లాపురం, సిద్దన్‌పల్లి, కుచినెర్ల, గువ్వలదిన్నె పరిధిలో వేలాడుతున్న తీగలను సరిచేయాలని, విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, రైతులు వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం మేరకు.. రాయచూర్‌కు చెందిన బోయ వీరేష్ (40) బీచుపల్లి పరిసర ప్రాంతాల్లో చెత్త కాగితాలు, ప్లాస్టిక్ సామాన్లు ఏరుకొని జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన రిక్షాపై బీచుపల్లి బ్రిడ్జిపై నుంచి రాంగ్ రూట్‌లో రంగాపురం వైపు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఎదురుగా వచ్చి రిక్షాను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అతన్ని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

14న సమావేశం విజయవంతం చేయండి

ఉండవెల్లి: ఈనెల 14న బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఆధ్వర్యంలో ఉండవెల్లిలోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 14న బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌కుమార్ సమావేశానికి హాజరై ఎన్నికలపై దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం

• ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పూలే జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై పూలే విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో అప్పటి కుల రక్కసిని పాలదోలేందుకు కృషి చేశారన్నారు. అప్పట్లో సమాజంలో స్త్రీ విద్య ఒక నేరంగా ఉండేదన్నారు. మహిళలను విద్యకు దూరంగా ఉంచాలనే సాంఘిక దూరచారపు సంకెళ్లను తెంచారన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు ఉన్నారు.

⇨ సమాజానికి స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే అని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్న, యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు నరసింహ, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కేవీపీఎస్, ప్రజా నాట్యమండలి, యూటీఎఫ్, సామాజిక సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో పూలే 197వ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే 1807లో మహారాష్ట్రలో జన్మించినట్లు తెలిపారు. ఆయన చిన్నప్పటి నుంచే దేశాభిమానం , సంఘసంస్కర్తగా, అనగారిన వర్గాల కోసం ఆయన పోరాటం చేశారన్నారు. 'గులాం గిరి' అనే గొప్ప పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. 1873లో జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజ్ నెలకొల్పినట్లు తెలిపారు. మహిళలకు చదువు చెప్పడానికి తొలిగా భార్యకు చదువు చెప్పి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారన్నారు. దేశవ్యాప్తంగా ఆ కాలంలోనే అనేక మహిళా పాఠశాలలను ఏర్పాటు చేసి స్త్రీ విద్యను ప్రోత్సహించారన్నారు. సతీసహగమనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపి మహిళల హక్కులను కాపాడారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలకు తూట్లు పొడుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సనాతన ధర్మం పేరుతో బాబసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తొలగించే దిశగా ప్రయత్నాలు చేస్తోందన్నారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలను బానిసలుగా మార్చేయత్నం చేస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు కే. నాగరాజు, మద్దిలేటి, నాగరాజు, రాజు, వెంకట్రాముడు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గట్టు: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మాచర్లలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతునాయుడు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసన్నలు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో, ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాచర్లలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముక్కెరన్న, ఏసురాజు, నర్సింహులు, ఏలియా, సామేలు, బాసు గోపాల్‌నాయుడు, గట్టులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, నాయకులు స్వామి, వెంకటేష్, పరశురాం, ఆంజనేయులు, ఐద్వా సంఘం నాయకురాలు జయమ్మ, గోవిందమ్మ, నర్సమ్మ, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతిని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. జ్యోతిరావ్‌పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, సీపీఎం జిల్లా నాయకులు మద్దిలేటి, సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు సుంకన్న, పాండు, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, రాంబాబు, నరసింహ, నాగరాజు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఆధిపత్య పోరుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ సామాన్య ప్రజల కోసం తన జీవితాన్ని దారపోసిన పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రజలంతా అన్ని రంగాల్లో సమానత్వంతో జీవించాలని పూలే ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను నేరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమేష్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్‌కుమార్, గుమ్మ గోవర్ధన్, రాజు, మంద సత్యం, సురేష్, రాగన్న, లింగరాజు, తదితరులు ఉన్నారు.



అలంపూర్‌లో పూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే విజయుడు

సామాజిక విప్లవ యోధుడు జ్యోతిరావు పూలే

గద్వాల: మహాత్మా జ్యోతిరావుపూలే భారత సామాజిక విప్లయోధుడని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గురువారం స్థానిక కృష్ణవేణి చౌరస్తాలో ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే చేసిన సేవలను కొనియాడారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా సడలని ధైర్యంతో బడుగువర్గాల్లో ధైర్యాన్ని నింపి ఆత్మ గౌరవంతో బతికే మార్గం చూపిన మహనీయుడని పేర్కొన్నారు.



గద్వాలలో పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు



అయిజలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మాచర్లలో జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు



ఎర్రవల్లి కూడళిలో పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

అలంపూర్‌లో మెజారిటీ సాధించాలి

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు నరసింహులు ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ స్థాయిలో బాగా కష్టపడి ప్రజలతో ఓట్లు వేయించాలని బూత్ అధ్యక్షులకు సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, వివిధ మండలాలకు నాయకులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే బీజేపీ ఆశయం

రాజోళి: దేశ ప్రజల శ్రేయస్సే బీజేపీ ప్రధాన ఆశయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బూతు స్థాయి కమిటీల సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత బూతు కమిటీలపైనే ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, బూత్ అధ్యక్షులు

హక్కుల కోసం పోరాటం చేస్తాం

శాంతినగర్: మదాసి, మదారి కురువ హక్కుల కోసం పోరాటం చేస్తామని ఆ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కురువ పల్లయ్య అన్నారు. వడ్డేపల్లి పురపాలికలోని శాంతినగర్‌లో చలో జడ్చర్ల వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి రోజున జడ్చర్లలోని చంద్ర గార్డెన్‌లో నిర్వహించే కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. మదాసి కురువ హక్కుల కోసం, కుల ధ్రువీకరణ పత్రాలను సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్ద సోమన్న, రంగన్న, పర్వతాలు, తిక్కన్న, గోకారి, కృష్ణ, అడివప్ప, చిన్నస్వామి, రంజిత్‌లు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కురువ సంఘం నాయకులు

బాధితులకు స్నేహితుల ఔదార్యం

అలంపూర్: గుండెపోటుతో మృతిచెందిన హిమాపురం కురువ ప్రతాప్ కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. ప్రతాప్ 15 ఏళ్ల క్రితం కర్నూలు జిల్లా కేంద్రంలోని యాదవ విద్యార్థి వసతి గృహంలో ఉంటూ ఎస్టీబీసీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. అనంతరం ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కర్నూలు యాదవ హాస్టల్ పూర్వ విద్యార్థులు ఓబయ్య, రామకృష్ణ, నాగరాజు, నారాయణ తదితరులు రూ.86 వేలు సేకరించి ప్రతాప్ కూతురు సాయివర్షిణి పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ బాండ్‌ను గురువారం ఇమాంపురం వెళ్లి ప్రతాప్ భార్య సాయమ్మకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఈదన్న, చంద్రుడు, తదితరులు ఉన్నారు.



డిపాజిట్ బాండ్ అందజేస్తున్న మిత్రులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కొత్తకోట రూరల్: బాల్య వివాహాలు చేయడం నేరమని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కౌన్సిల్ సభ్యులు హరికృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంబీసీ చర్చి వద్ద కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు నేరమన్నారు. అమ్మాయి చిన్న వయస్సులోనే గర్భం దాల్చడంతో వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. బాల్య వివాహాలు చేసినట్లు తెలిస్తే వెంటనే కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ వారికి లేదా చైల్డ్ లైన్ నంబర్ 1098, 112, 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీసీ చర్చి చైర్మన్ ఆనంద్, పాస్టర్ మినిసినో, నిక్సన్, ఇజ్రాయిల్, కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ కొత్తకోట ఇన్‌చార్జీ రజినికాంత్, విజయ్ తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

క్లుప్తంగా...

ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులు



రాకెట్ లాంచర్ పడిన చోట ఏర్పడిన గుంత, విరిగిన చెట్లు

చర్ల: మావోయిస్టులను నిర్మూలించే లక్ష్యంతో పోలీసులు ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులు చేస్తుండటం హేయనీయమని మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ గురువారం లేఖ విడుదల చేశారు. అందులోని వివరాల ప్రకారం.. ఈనెల 7న రాత్రి 11.45 గంటల సమయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ – సుక్మా జిల్లాల సరిహద్దు పామేడు సమీపాన పాలగూడ, ఇత్తగూడ, జిల్లేరుగట్టు, గొమ్ముగూడ, కంచాల గ్రామాల్లో పోలీసులు డ్రోన్ల ద్వారా దాడులు చేశారని ఆరోపించారు. ఆయా గ్రామాలపై రాకెట్ లాంచర్లు వదలడంతో ఆదివాసీలు తీవ్రంగా ఆందోళన చెందారన్నారు. ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీయాల్సి వచ్చిందని, ఇకనైనా పోలీసు బలగాలు ఆదివాసీ గ్రామాలపై దాడులను వెంటనే నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె లేఖతోపాటు రాకెట్ లాంచర్లు వదిలిన ప్రాంతాల ఫొటోలు విడుదల చేశారు.

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్



చాదర్‌ఘాట్: మాజీ హోంమంత్రి మహమూద్ అలీ నివాసంలో జరిగిన రంజాన్ వేడుకల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. గురువారం అజంపురాలోని మహమూద్ అలీ ఇంటికి చేరుకున్న కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మహమూద్ అలీతో పాటు పలువురు మైనారిటీ నాయకులకు కేటీఆర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

‘ఆయిల్‌పామ్’..అంతంతే

- సాగులో నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోని ప్రైవేట్ కంపెనీలు
- పామాయిల్ ఫ్యాక్టరీల ఏర్పాటులోనూ నిర్లక్ష్యం
- సమీక్ష చేసి అవసరమైతే కంపెనీలతో ఒప్పందాల రద్దు?



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పామ్ సాగు రాష్ట్రంలో ఆశించినస్థాయిలో పెరగలేదు. దీనిపై సర్కారు దృష్టి సారిస్తున్నా..కొన్ని కంపెనీలు మాత్రం వెనకడుగు వేస్తున్నాయి. ఆయిల్‌పామ్ విస్తీర్ణాన్ని వచ్చే దశాబ్దంలోగా ఏకంగా 20 లక్షల ఎకరాలకు విస్తరించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది.రాష్ట్రంలో ఆయిల్‌ఫెడ్ సహా 14 ప్రైవేట్ కంపెనీలకు ఆయిల్ పామ్ సాగుకు అవసరమైన బాధ్యతలు అప్పగించింది. మొత్తం 31 జిల్లాలను గుర్తించింది. కొన్నేళ్లుగా ప్రైవేట్ కంపెనీలు తమ నిర్ణీత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవుతున్నాయి. సాగు చేయించడంలోనూ, ఆ మేరకు రైతులను ఒప్పించడంలోనూ అనాసక్తి చూపిస్తున్నాయి. మరోవైపు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని కొన్ని కంపెనీలు సేకరించలేదు. దాదాపు మూడేళ్ల క్రితమే ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, కంపెనీలు పట్టించుకోలేదు. ఇప్పటి వరకు భూములు కొనకపోతే ఫ్యాక్టరీలు ఎప్పుడు నిర్మిస్తారోనన్న విమర్శలు వస్తున్నాయి. ఒప్పందం ప్రకారం మూడేళ్లలోపు ఫ్యాక్టరీ నిర్మించాలి. కానీ ఈ నిబంధనను అనేక కంపెనీలు అమలు చేయడం లేదు. పంట చేతికొచ్చే సమయానికి ఫ్యాక్టరీ అందుబాటులో లేకుంటే రైతులు ఇబ్బందులు పడతారు. ఇప్పటికే కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేసిన జిల్లాల్లో పంట గెలలు అందుబాటులోకి వచ్చాయి. మరో ఏడాదిలో మరింత ఎక్కువగా అందుబాటులోకి వస్తాయంటున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీలు ఇంకా నిర్లిప్తంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లక్ష్యాన్ని చేరుకోలేని దుస్థితి

ఆయిల్‌పామ్ సాగులో 14 కంపెనీలు తమ లక్ష్యంలో కేవలం 20 శాతం వరకే చేరుకున్నాయని అధికారులు అంటున్నారు. ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ మినహా ఇతర ప్రైవేట్ కంపెనీల్లో పెద్దగా పురోగతి లేదు. వంట నూనెల జాతీయ పథకం (ఎన్‌ఎంఈఓ) ద్వారా కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని వాటికి జిల్లాలు, అందులో భూముల సాగు లక్ష్యాలను నిర్దేశించింది. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు స్థాపించడం, రైతులను ఒప్పించి మొక్కలు వేయడం, వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం, పంట వచ్చిన తర్వాత కొనుగోలు చేయడం వంటి వాటిని ఈ కంపెనీలు చేపట్టాలి. 2020–21లో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు ఇప్పటివరకు కేవలం 1,52,957 ఎకరాల్లోనే పంటలు వేయించాయి. వీటిలో టీఎస్ ఆయిల్‌ఫెడ్ 87 వేల ఎకరాల్లో..మిగిలిన సంస్థలు 65 వేల ఎకరాల్లోనే పంటలను వేయించాయి. ఈ నేపథ్యంలో సాగు లక్ష్యాన్ని చేరుకోని కంపెనీలతోపాటు ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోలేని కంపెనీలకు ఉద్యానశాఖ నోటీసులు జారీ చేసింది. అయితే కంపెనీలు మాత్రం సాగుకు రైతులు ముందుకు రావడం లేదంటూ వివరణ ఇచ్చాయి. ప్రైవేట్ కంపెనీలు రైతుల వద్దకు వెళ్లడానికి అవసరమైన సిబ్బందిని నియమించడంలోనూ... రైతులను ప్రోత్సహించడంలోనూ విఫలం అవుతున్నాయి. పైగా ప్రైవేట్ కంపెనీలు కావడంతో వాటిని రైతులు నమ్మడం లేదన్న చర్చ జరుగుతోంది. తమకు ప్రోత్సాహకాలు అందుతాయో లేదోనని, పంట కొనుగోలు చేయరేమోనని అనుమానపడుతున్నారు. వారి అనుమానాలను తొలగించే ప్రయత్నాలు చేయడం లేదు. ఈ నేపథ్యంలో లక్ష్యంలో 20 శాతం కూడా సాధించక పోవడంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా కంపెనీలతో సమావేశం నిర్వహించాలని, వాటి నుంచి ఆశించిన స్పందన లేకపోతే అవసరమైతే ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన అన్నట్లు సమాచారం.

ప్రాణాలు తీసిన అతివేగం

- చెట్టును ఢీకొట్టిన కారు • అక్కడికక్కడే ఇద్దరు యువకులు మృతి
- మరో ముగ్గురికి స్వల్ప గాయాలు
- సూర్యాపేట సమీపంలోని రాయినిగూడెం వద్ద ప్రమాదం



ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన వాహనం



మృతుడు నవీన్ (ఫైల్)



మృతుడు సాయి (ఫైల్)

సూర్యాపేట: అతివేగం ఇద్దరి యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. మితిమీరిన వేగంతో చెట్టును ఢీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు యువకుల్లో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు యువకులకి స్వల్ప గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన ఆరుగురు యువకులు ఎర్టిగా కారును అద్దెకు తీసుకుని సూర్యాపేటలోని వీరి స్నేహితుడు ఉదయ్‌ను కలిసేందుకు గురువారం వచ్చారు. వీరంతా బాల్యస్నేహితులు. అతడితో కలిసి కాసేపు సరదాగా పట్టణంలో తిరిగి ఉదయ్‌ను కూడా కారులో ఎక్కించుకుని కేతేపల్లికి బయలుదేరారు. సూర్యాపేట మండలంలోని రాయినిగూడెం శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో జటంగి సాయి (17), అంతటి నవీన్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మారగోని మహేష్, కావడి శివ, అబ్బూరి గణేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే మిగిలిన మరో ఇద్దరు యువకులు చింత మళ్ల ధనుష్ అలియాస్ బన్ని, ఉదయ్ ఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు. ధనుష్ కారును 170 స్పీడ్‌తో నడపడంతోనే అదుపు తప్పినట్టు తెలుస్తోంది. మితిమీరిన వేగంతో కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. చెట్టు విరిగిపోవడమే కాకుండా కారు నుజ్జునుజ్జయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

గురుకుల సొసైటీల ఇష్టారాజ్యం!

ఇంటర్ బోర్డు నిబంధనల అతిక్రమణ

- వేసవి సెలవుల్లోనూ జూనియర్ కాలేజీల నిర్వహణ
- ఫస్టియర్ విద్యార్థులకు సెకండియర్ పాఠ్యాంశాల బోధన
- సెకండియర్ విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్ కోచింగ్



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల సొసైటీలు ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలను గాలికొదిలేశాయి. వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత కాలేజీలకు సెలవులు ప్రకటించాలని ఆదేశిస్తూ తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు గత నెల 30న ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 31 నుంచి మే నెల 31వరకు రెండు నెలల పాటు వేసవి సెలవులు ఇవ్వాలని, జూన్ 1వ తేదీ నుంచి కళాశాలలు పునఃప్రారంభించాలని స్పష్టం చేసింది. కానీ ఈ నిబంధనలను పట్టించుకోని గురుకుల సొసైటీలు... పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే తరగతులు ప్రారంభించాయి. ఇంటర్మీడియ్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు రెండో సంవత్సరం పాఠ్యాంశాన్ని ప్రారంభించగా... ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన తరగతులు నిర్వహిస్తున్నారు.

ఏయే సొసైటీలంటే..

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీటీడబ్ల్యూఆర్‌ఈఎస్), మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) ప్రస్తుతం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) జూనియర్ కాలేజీలను పూర్తిస్థాయిలో నిర్వహిస్తుండగా... తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎంఆర్‌ఈఐఎస్) మాత్రం రంజాన్ నేపథ్యంలో వచ్చే వారం నుంచి తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది.

సీఓఈలకు ప్రత్యేకమంటూ...

రాష్ట్రంలోని గురుకుల సొసైటీల పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక ప్రాంగణంలో ఐదో తరగతి నుంచి పదోతరగతి వరకు పాఠశాలలు నిర్వహిస్తుండగా.. జూనియర్ కాలేజీని ప్రత్యేక ప్రిన్సిపల్‌తో నిర్వహిస్తున్నారు. గురుకుల సొసైటీలకు పాఠశాలలతో పాటు ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం సీఓఈల పేరిట ప్రత్యేక పాఠశాలలున్నాయి. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 38, ఎస్టీ గురుకుల సొసైటీ పరిధిలో 30, బీసీ గురుకుల సొసైటీ పరిధిలోని 12 సీఓఈల్లో ఇంటర్మీడియట్ తరగతులను పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆయా సొసైటీ కార్యదర్శులు వేరువేరుగా ఉత్తర్వులు సైతం జారీ చేశారు. సీఓఈల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫస్టియర్ కేటగిరీకి మే 15వ తేదీ వరకు, సెకండియర్ విద్యార్థులకు మే 26వ తేదీ వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. ముందస్తుగా పాఠ్యాంశాన్ని ముగించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని నిర్ణయించినట్లు సొసైటీ కార్యదర్శులు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

అదే బాటలో ప్రైవేటు కాలేజీలు..

గురుకుల విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహిస్తుండడంతో పలు ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలు సైతం ఇదే బాట పట్టాయి. ఇంటర్మీడియట్ బోర్డు ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇష్టానుసారంగా తరగతులను నిర్వహిస్తున్నాయి. వేసవి సీజన్‌లో తీవ్రమైన ఎండలు, ఉక్కపోత ఉండగా కనీస ఏర్పాట్లు చేయకుండా పలు కాలేజీలు తరగతులు నిర్వహిస్తుండడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరగతులకు హాజరు కాకుంటే సిలబస్ మిస్సవుతుందనే ఆందోళనతో తప్పనిసరి పరిస్థితుల్లో పంపుతున్నట్లు వాపోతున్నారు.

వృద్ధురాలి ఆభరణాలు చోరీ

- మహిళా దొంగలను పట్టుకొని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు



ఖిల్లాఘనపురం: మధ్యాహ్నం వేళ దాహంగా ఉంది.. నీరు ఇవ్వాలంటూ వచ్చిన ఇద్దరు మహిళా దొంగలు వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణాలు లాక్కెళ్లారు.. సదరు వృద్ధురాలి కేకలతో గ్రామస్తులు వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన వనపర్తి జిల్లాలో ఖిల్లాఘనపురం మండలం సోళీపురంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు కథనం మేరకు వివరాలిలా.. గ్రామానికి చెంది 82 ఏళ్ల వృద్ధురాలు గిన్నె దేవమ్మ కుటుంబ సభ్యులందరూ గురువారం ఉదయమే పనులకు వెళ్లారు. ఇంటి దగ్గర వృద్ధురాలు ఒక్కరే ఉన్నారు. మధ్యాహ్నం సమయంలో వనపర్తి పట్టణానికి చెందిన ఇద్దరు మహిళలు వృద్ధురాలి ఇంటికి వచ్చి తాగడానికి మంచి నీరు ఇవ్వమని అడిగారు. ఎండాకాలం కదా దాహం వేసిందేమో అని ఆ వృద్ధురాలు నీరు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లింది. ఇదే అదునుగా ఇద్దరు మహిళలు ఇంట్లోకి వెళ్లి వృద్ధురాలి చేతులకు ఉన్న వెండి కడియాలు, మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కొని వెళ్లారు. కడియాలు తీస్తున్న సమయంలో వృద్ధురాలు దేవమ్మ ఎడమ చేతికి తీవ్రగాయమైంది. చేసేది లేక ఏడుస్తు బయటకు వచ్చి కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు గమనించి అక్కడికి వచ్చి చూశారు. బంగారు ఆభరణాలు లాక్కెళ్లారని చెప్పడంతో గ్రామస్తులు మోటారు సైకిళ్లపై చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికి దొంగలను పట్టుకున్నారు. విషయాన్ని వెంటనే పోలీసులకు చెప్పి మహిళా దొంగలను పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. ఇద్దరు దొంగలు వనపర్తికి చెందిన బుర్రమ్మ, లక్ష్మిగా గుర్తించడం జరిగిందని చెప్పారు.

ఈత.. మృత్యువాత

- వేసవి సరదాలతో విద్యార్థులకు పొంచి ఉన్న ముప్పు
- అవగాహన లేక ప్రాణాలు కోల్పోతున్న వైనం
- దేవరకద్ర సమీపంలో బావిలో మునిగి ఇద్దరు యువకుల మృతి
- తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటిస్తే మేలు



మహబూబ్‌నగర్ క్రైం: పదో తరగతి.. ఇంటర్ పరీక్షలు ఇప్పటికే ముగిశాయి.. విద్యార్థులకు సెలవులు సైతం ఇచ్చారు. దీంతో వేసవి సెలవుల్లో పిల్లలు ఈత నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతారు. అలాంటిది జిల్లాలో ఈత రాక ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. ఈ మధ్యకాలంలో స్విమ్మింగ్ పూల్స్‌లలో కూడా ప్రమాదవశాత్తు పడి మృతి చెందుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా భౌగోళికంగా చూస్తే వాగులు, వంకలు, నదులు, కాల్వలకు కొదువ లేదు. దీంతో ఈ మధ్య ప్రాజెక్టుల కోసం, మిషన్ భగీరథ, మైనింగ్ గుంతలలో నిలిచిన నీటిలో ఈత కోసం వెళ్తున్నారు. దీంతో ప్రమాదవశాత్తు వాటిలో మునిగి తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు.

బావులు, చెరువుల వద్ద రక్షణ చర్యలు కరువు.

మండు వేసవిలో ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి.. సెలవుల సరదాతో కాలక్షేపం కోసం ఈతకు వెళ్లడం అందరికీ అభిరుచిగా మారుతోంది. జిల్లా కేంద్రంతో పాటు ఇతర పట్టణాల్లో.. గ్రామీణ ప్రాంతాల్లో ఈత సరదా తీర్చుకునేందుకు అనువుగా స్విమ్మింగ్ పూల్స్ వెలిసినా ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువకులు ఆయా ప్రాంతాల్లో ఉండే బావులు, కుంటలు, చెరువులు, కాల్వలను ఆశ్రయిస్తున్నారు. చాలా మందికి ఈత కొట్టడం ఎలాగో తెలియక ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. రక్షణ చర్యల్లేక ఈత మాటున నిండు ప్రాణాలను పోగొట్టుకొని కన్నవారి కడుపు కోత మిగులుస్తున్నారు. వేసవిలో బాలలు, యువకులు జిల్లాలో ఈతకు వెళ్తూ నీటిలో మునిగి మృత్యువాత పడుతున్న సంఘటనలు ఏటా జరుగుతున్నాయి. నీటిలోతు, ఈత కొట్టే పద్ధతులు తెలియక అందులో మునిగిపోతుండగా రక్షణ చర్యలు కరవయ్యాయి.

ఆపద నుంచి రక్షించడం ఇలా..

ప్రత్యక్ష పద్ధతి ద్వారా నీటిలో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించే వీలుంటుంది. అయితే రక్షించబోయే వ్యక్తికి ఈత రావడంతో పాటు ధైర్యం కలిగి ఉండాలి. నీటిలో మునుగుతున్న వ్యక్తి వెనుక నుంచి వెళ్లి అతని వెంట్రుకలు, అండర్‌వేర్, మొలతాడు వంటి వాటిల్లో ఏదో ఒకటి పట్టుకొని ఒడ్డుకు తీసుకురావాలి.

- పరోక్ష పద్ధతి విషయానికి వస్తే ఈత వచ్చిన వారితో పాటు రాని వారు కూడా నీటిలో మునుగుతున్న వారిని రక్షించవచ్చు. రక్షించే వారు నీటిలోకి దిగకుండా ఒడ్డున ఉండే ప్రమాదంలో చిక్కుకున్న వారికి ఆసరాగా ఒడ్డునుంచే దేన్నైనా పట్టుకునేలా కర్ర, టవల్, ఫ్యాంట్ వంటివి అందించాలి. దూరంగా ఉంటే తాడు, పొడవాటి కర్రను అందించి ఒడ్డుకు చేర్చాలి. నీటిపై తేలియాడే పరికరాలను నీటిలోకి విసిరి వేయాలి.
- నీటిలో పడి ప్రమాదానికి గురైన వ్యక్తిని ఒడ్డుకు చేర్చగానే అతన్ని వెల్లకిలా పడుకోబెట్టాలి. అవసరమైతే నోట్లో నోరు పెట్టి శ్వాస ఊదుతూ కృత్రిమ శ్వాస అందించాలి. ఛాతిపై చేతులతో ఒత్తాలి. దీంతో శ్వాస పెరుగుతుంది. ప్రథమ చికిత్స చేస్తూనే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించాలి.

ఈ జాగ్రత్తలు అవసరం..

- ఈత కొలనుల్లో ఈత నేర్చుకునేందుకు వెళ్తున్నప్పుడు అక్కడ సుశిక్షితులైన కోచ్‌లు, ఇతర సిబ్బంది రక్షణ చర్యలు తీసుకున్నారో లేదో పెద్దలు పరిశీలించాల్సిన తర్వాతే పిల్లలను పంపించాలి.
- చెరువులు, కాల్వల్లో, ఈతకు వెళ్తున్నప్పుడు బాలల వెంట పెద్దవారు తప్పక వెళ్లాలి.
- కొత్త ప్రదేశంలో బావులు, కాల్వలు, చెరువుల్లో ఈత కొట్టే ముందు కర్ర సాయంతో లోతును పరిశీలించాలి. ఈత రాని వారు దాన్ని నేర్చుకునేందుకు ట్యూబ్‌లు, ఇతర పరికరాలను ఉపయోగించి పూర్తిగా ఈత కొట్టడం వచ్చాకే లోతుకు వెళ్లాలి.
- సెలవులు కాబట్టి పిల్లలు బయటికి వెళ్లి చాలా సమయం అయితే వారి వారి తల్లిదండ్రులు పిల్లల సమాచారంపై వాకబు చేసుకొని చూసుకోవాల్సిన అవసరం ఉంటుంది.
- విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు స్నానం ఆచరించాలే తప్ప అక్కడి వాటిల్లోకి వెళ్లి ఈత కొట్టడం చేయవద్దు.
- మట్టిని లోతుగా తవ్విన ప్రాంతాల్లో నిలిచిన నీటిలో లోతు తెలియదు. కాబట్టి ఇలాంటి వాటిల్లో ఈతకు సాహసం చేయరాదు.
- జిల్లాలో కృష్ణ, జూరాల, కోయిల్‌సాగర్, ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడ చాలా జాగ్రత్తగా ఉండాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో సెలవులు గడపటానికి వచ్చిన పిల్లలు ఈతకు వెళ్లినప్పుడు వారి వెంట పెద్దవారు తప్పకుండా వెళ్లాలి.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గుర్తింపునకు కృషి



విజేత జట్టుతో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

కొత్తకోట రూరల్: రాష్ట్రస్థాయి క్రీడల్లో వనపర్తి నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. పెద్దమందడి మండలం దొడగుంటపల్లిలో తొమ్మిది రోజుల పాటు కొనసాగిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించగా.. ఆయనతో పాటు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పెద్దమందడి ఎంపీపీ రఘుప్రసాద్, భార్గవి, రాజశేఖర్‌శెట్టి, సూర్యచంద్రారెడ్డి, వెంకటస్వామి, చరణ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుదర్శన్, ఛత్రపతి శివాజీ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశంలో సుపరిపాలన



మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

ఆత్మకూర్: బీజేపీ పదేళ్ల పాలనలో దేశ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాలకులు అభివృద్ధిని విస్మరించి మతకలహాల్లో మునిగి తేలుతున్నారని తెలంగాణ రాష్ట్ర గీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ అన్నారు. గురువారం ఆత్మకూర్‌లోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రహ్మతుల్లా నివాసంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. దేశంలో కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని దేశవ్యాప్తంగా ప్రజలందరూ విశ్వసిస్తున్నారని రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాలమూరుకు మహర్దశ రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మత, జాతి విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన కొనసాగిస్తున్న బీజేపీకి రోజులు దగ్గరపడ్డాయని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో పూర్తిగా గల్లంతు కావడం ఖాయమన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీగా చల్లా వంశీచంద్‌రెడ్డి, దేశ ప్రధానిగా రాహుల్‌గాంధీ జూన్‌లో ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు తులసిరాజ్‌యాదవ్, పరమేష్, నల్లగొండ శ్రీను, అజ్మతుల్లా, గంగ, వెంకటనర్సింహారావు, కోట్ల వెంకటేష్, నాగేష్, సాయిరాఘవ, షంషీర్, గద్దం శ్రీనివాస్‌యాదవ్, రఫిక్, మహేష్, దాము, అశోక్, నాగేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

కృష్ణా/ బాలానగర్/ కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన వాహనాల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం కృష్ణా మండలం రాష్ట్ర సరిహద్దు కృష్ణా చెక్‌పోస్టు వద్ద ఏఎస్‌ఐ సురేంద్రబాబు, ఎస్‌ఐ ఎండీ నవీద్ అధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి కారులో వస్తున్న ప్రవీణ్‌గౌడ వద్ద రూ.98 వేల నగదు లభించింది. దీంతో సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని నారాయణపేట గ్రీవెన్స్ కమిటీకి అప్పగించామని వారు చెప్పారు.

బెల్టు షాపులో మద్యం పట్టివేత

బాలానగర్ మండలంలోని నేరళ్లపల్లిలో బెల్టుషాపు నుంచి 19.5 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో బంటు రవి అనే వ్యక్తి దుకాణంలో నిల్వ ఉంచిన 19.5 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు బంటు రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు.



కృష్ణా చెక్‌పోస్టులో సీజ్ చేసిన నగదు చూపిస్తున్న పోలీసులు



బాలానగర్‌లో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పత్రాలు లేకుండా తీసుకెళ్లొద్దు

కేటీదొడ్డి మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. గురువారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులు వాహనాలు తనిఖీలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల్లో పెద్దఎత్తున నగదు, మద్యం తరలిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన రశీదులను చూపాలని చెప్పారు. తనిఖీల్లో సిబ్బంది కృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

బిజినేపల్లి: మండలంలోని పాలెం గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పాలెం గ్రామానికి చెందిన మల్లేష్ బుధవారం సాయంత్రం తన కుటుంబంతో కలిసి లింగసానిపల్లికి వెళ్లాడు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో చోరీ చేసి రూ.75వేల నగదు, రెండు తులాల బంగారం, 25 తులాల వెండి అపహరించుకెళ్లాడు. బాధితుడి సమాచారం మేరకు పోలీసులకు విచారణ ప్రారంభించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పోలీసులు వేర్వేరు చోట్ల పట్టుకున్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాల సమీపంలో ఒక ట్రాక్టర్‌ను, జెడ్పీహెచ్‌ఎస్ సమీపంలో మరో ట్రాక్టరును, అదేవిధంగా రంగంపేట వద్ద పట్టుకున్న ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని కొట్టె జంగయ్య, డ్రైవర్ కుందేళ్ల శ్రీకృష్ణ, మరో రెండు ట్రాక్టర్ల డ్రైవర్లు లింగాల మండలం సూరాపూర్ గ్రామానికి చెందిన కురుమూర్తి, అమ్రాబాద్ మండలం తెలుగుపల్లికి చెందిన ఉదయ్‌కుమార్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.